సాక్షి తిరుపతి
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



దౌర్జన్యంగా ప్రహరీ కూల్చివేత

మాధవమాలలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు ఇంటి ప్రహరీని రాజకీయ కక్షతో కూలగొట్టారు.

- IIలో



దంచికొట్టిన వాన

తిరుపతిలో శనివారం వర్షం దంచికొట్టింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- IIలో



ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

పరిశ్రమ కార్మికులు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడి గాయాలపాలయ్యారు.

- IIలో

న్యూస్‌రీల్

రేపటి నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం

తిరుపతి సిటీ : దసరా సెలవుల అనంతరం సోమవారం నుంచి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇప్పటికే అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే..దీంతో 10 రోజులుగా సెలవుల్లో గడిపిన విద్యార్థులు పుస్తకాలు చేతపట్టి తరగతులకు హాజరయ్యేందుకు సన్నద్ధమవుతున్నారు.

స్విమ్స్‌లో 10 నుంచి ఉచితంగా కంటి ఆపరేషన్లు

తిరుపతి తుడా : స్విమ్స్ ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవారి వైద్యసేవ పథకంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ వెంకటాచలం పేషంట్లను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా క్యాటరాక్ట్ (శుక్లాలు, గ్లకోమా) ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన ప్రజలు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డ్ తెలుపు రంగు రేషన్ కార్డు తీసుకుని స్విమ్స్‌లోని శ్రీ పద్మావతి ఆసుపత్రిలో మెడికల్ రికార్డు విభాగం నందు ఓపీ నమోదు చేసుకుని అనంతరం ఆప్తమాలజీ విభాగం రూమ్ నంబర్ 45 నందు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటి వైద్యులను సంప్రదించాలని సూచించారు. టీటీడీ రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఎస్‌ఎల్‌ఎస్‌ఎంపీసీ, సొసైటీలలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు స్విమ్స్ ఆప్తమాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.ప్రభంజన్ కుమార్‌ను 9491341561 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

తిరుపతి అర్బన్ : రాష్ట్ర పండుగగా వాల్మీకి మహర్షి జయంతిని జరుపుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఈనెల 7వ తేదీ(మంగళవారం) తిరుపతి కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో వాల్మీకి, బోయ కుల సంఘం నేతలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండాయి. క్యూలైన్ గోగర్భం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,581 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,976 మంది తలనీలాలు అర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.60 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో స్వామివారం దర్శనం లభిస్తోంది.

30 మందికి అంతర్‌జిల్లా బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పనిచేస్తున్న టీచర్లకు శనివారం అంతర్ జిల్లా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. చిత్తూరు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. స్పౌజ్ కేటగిరీలో 10 మంది, మ్యూచువల్ కేటగిరీలో 20 మొత్తం 30 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం వారికి అంతర్‌జిల్లా బదిలీల ఉత్తర్వులు అందజేశారు. అదే విధంగా ఇద్దరు ఎంఈవోలకు ఆర్జేడీ కార్యాలయంలో అంతర్‌జిల్లా బదిలీలు నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

సీలింగ్ భూములపై కన్ను

కోట్లాది రూపాయలు విలువ చేసే సీలింగ్ భూములను కొట్టేసేందుకు కూటమి నేతలు పక్కా స్కెచ్ వేశారు. కొన్నది ఒకచోటైతే.. కొట్టేయాలని చూస్తున్న భూములు మరోచోట ఉన్నాయి. జాతీయ రహదారికి పక్కనే ఉన్న రూ.కోట్ల విలువైన భూములను చూపించి.. కొనుగోలు చేసింది ఇవే అన్నట్లు రికార్డులు తారుమారు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అధికార పార్టీ నేతకు అమ్ముడుపోయిన ఓ రెవెన్యూ అధికారి భూ మేతకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

కొనుగోలు చేసిన భూములకు ముందు జాతీయ రహదారికి ఆనుకున్న ఉన్న కోట్లాది రూపాయలు విలువ చేసే భూముల్లో ఓ భాగం



కడివేడులో భూ బకాసురులు

- 221 ఎకరాల సీలింగ్ భూములే లక్ష్యం
- కొనుగోలు చేసిన భూములు ఒకచోట
- కొట్టేయాలని చూస్తున్న భూములు మరోచోట
- జాతీయ రహదారి పక్కనున్న భూముల కోసం స్కెచ్
- రికార్డులు తారుమారుకు రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు
- కోట్ల రూపాయలు విలువ చేసే భూములు కొట్టేసేందుకు కుట్ర
- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు పరిధిలో టీడీపీ నేతల బరితెగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం కడివేడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 805లో ఓడురుకు చెందిన జక్కంరెడ్డి కుటుంబ సభ్యులకు 873.75 ఎకరాల భూమి ఉంది. 1973లో సీలింగ్ యాక్ట్ వచ్చిన తరువాత జక్కం రెడ్డి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి 633 ఎకరాలు అప్పగించారు. వారు ప్రభుత్వానికి అప్పగించిన భూములు చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి పక్కన భూములు. మిగిలిన 240 ఎకరాలు జాతీయ రహదారికి కొంచెం లోపల ఉన్నాయి. ఇందులో కొంత భూమిని జక్కం రెడ్డి కుటుంబ సభ్యులు విక్రయించారు. అలా కొనుగోలు చేసిన వారి నుంచి టీడీపీ నేత, బడా పారిశ్రామిక వేత్త, ఓ సంగీత దర్శకుడు, నెల్లూరుకు చెందిన ఓ డాక్టర్ మరి కొంత మంది కొనుగోలు చేశారు. కొనుగోలుదారులు వారు కొన్న భూములను పక్కన పెట్టి జాతీయ రహదారి పక్కన ఉన్న సీలింగ్ భూముల్లోకి చొరబడ్డారు. అందులో వివిధ రకాలు పండ్ల తోటలు, నిర్మాణాలు చేపట్టి దర్జాగా అనుభవిస్తున్నారు. చొరబాటు దారులు కొనుగోలు చేసిన భూములకు పట్టాదారు పుస్తకాలు అడగకుండా.. ఆక్రమించి ప్రస్తుతం అనుభవిస్తున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కొంత కాలంగా అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే..

గత ప్రభుత్వ హయాంలో సీలింగ్ భూములను చట్టబద్ధం చేయటానికి వీలుకాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అవే సీలింగ్ భూములను చట్టబద్ధం చేసుకునేందుకు టీడీపీ నేతలు జోరుగా అడుగులు వేస్తున్నారు. అదే విధంగా ఇదే సర్వే నంబర్‌లో జాతీయ రహదారి పక్కనే ఖాళీగా ఉన్న సీలింగ్ భూములకు మరి కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించుకుని ఆ భూముల్లో పాగా వేశారు. వారు కూడా కూటమి నేతలు, రెవెన్యూ అధికారుల ద్వారా ఆక్రమించుకున్న విలువైన భూములను చట్టబద్ధం చేసుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గత కొన్నేళ్ల గూడూరు డివిజన్‌లో పాతుకుపోయిన ఓ అవినీతి అధికారి రికార్డులు సృష్టించేందుకు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పదవీ విరమణ చేయనున్న ఆ అధికారి అందినకాడికి దండుకుని సర్వే నంబర్ 805లో పచ్చ ముఠా నాయకుడికి మరో 14 మందికి 221.95 ఎకరాల భూములకు విక్రయించి సొమ్ము చేసుకునేలా రికార్డులు తయారు చేసేపనిలో నిమగ్నమైనట్లు చిల్లకూరులో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

నేతలకు కట్టబెట్టేందుకు..

సీలింగ్ భూములను కూటమి నేతలకు కట్టబెట్టేందుకు 15.04.25న ఆర్సీబీ /186/2025న ఆ భూములకు సంబంధించి గ్రామ ప్రజల నుంచి అభ్యంతరాలు కోరుతూ ఏప్రిల్ 15న ఒక నోటీస్ జారీ చేశారు. ఆ నోటీసును పంచాయతీ కార్యాలయం, సచివాలయం, గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం లో అంటించారు. ఆ భూములకు సంబంధించి ఎవ్వరు అభ్యంతరం చెప్పలేదని జూన్ 30న జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు సమాచారం. 14 మంది 221.95 ఎకరాలు విక్రయించుకునేందుకు వీలుగా ఆదేశాలు ఇవ్వాలని లేఖ ద్వారా కోరినట్లు రెవెన్యూ అధికారులు చర్చించుకుంటున్నారు. వందల ఎకరాలు ఇతరులకు కట్టబెట్టే సమయంలో ఆ గ్రామం, పరిసర గ్రామాల్లో దండోరా వేయటంతో పాటు మైక్ ద్వారా చెప్పటం, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ద్వారా ప్రజలకు తెలిసే విధంగా ప్రకటనలు ఇవ్వాలి. అలా కనీసం నెల రోజులు ప్రచారం చేయాలి. ఇటువంటి ప్రయత్నాలేవీ చేయకుండా గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కనిపించి కనిపించకుండా నోటీసులు అంటించి భూ కబ్జాదారులకు సహకరించడంపై పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



రూ.కోట్లు విలువ చేసే సీలింగ్ భూములు

వెలుగులోకి వచ్చింది ఇలా..

భూకబ్జా బాగోతం తెలిసిన గూడూరు నియోజకవర్గం బీజేపీ నాయకుడు బైరప్ప 221 ఎకరాలపై రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 805లోని 221 ఎకరాలు వాస్తవ భూస్థితిని, 1970 నుంచి ఉన్న రికార్డులను సీసీ ఫైల్స్, స్కెచ్‌లను పూర్తి స్థాయిలో పరిశీలించి జాతీయ రహదారికి అనుకొని ఉన్న వందల కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి పరులపాలు కాకుండా కాపాడాలని, ఉన్నతాధికారులు రీ ఎంక్వయిరీ చేసి రిపోర్ట్ పంపాలని కోరారు. బైరప్ప ఫిర్యాదుతో కూటమి నేతలు, వారికి సహకరిస్తున్న కొందరు రెవెన్యూ అధికారులకు నోట్లో పచ్చి వెళ్లక్కాయి పడినట్లు అయింది.

నినదిస్తాం.. నిలదీస్తాం!

'దళిత జాతికి ఎక్కడ అవమానం జరిగితే అక్కడ వాలిపోతాం. వారికి అండగా నిలబడతాం. కూటమి పాలనలో దళితులకు సముచిత స్థానం దక్కడం లేదు. వారిని చిన్నచూపు చూడడం.. అవహేళన చేయడం రివాజుగా మారుతోంది. దళితుల దేవుడు, పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను కూల్చడం, పెట్రోలు పోసి నిప్పు పెట్టడం లాంటి వికృత చేష్టలకు పూనుకుంటున్నారు. ఇలాంటి వాటిని సహించేది లేదు. దోషులను వదలి.. మాపై నిందలు వేస్తే ఊరుకునేది లేదు..' అంటూ వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు.చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. బాబాసాహెబ్ విగ్రహానికి నిప్పుపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దళిత జాతికి అవమానమా.. సిగ్గుసిగ్గు

- వారికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు
- తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు
- దేవళంపేటలో వైఎస్సార్‌సీపీ ధర్నా
- అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వెదురుకుప్పం: 'పేదల పక్షాన నిలబడతాం.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టి అమాయకులపై అన్యాయంగా కేసులు పెడితే ఊరుకునేది లేదు' అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. దోషులను అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

కేసుల నుంచి తప్పించే కుట్ర

మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టిన కూటమి నాయకులను కేసుల నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. దళితుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్‌కు అవమానం జరిగితే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో దేవళంపేటలో సర్పంచ్ గోవిందయ్య అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పారని గుర్తుచేశారు. అయితే ఘటన తర్వాత అప్పట్లో వేసిన శిలాఫలకాన్ని తొలగించడం దారుణమన్నారు. న్యాయం చేయాలని ప్రాధేయ పడిన సర్పంచ్ గోవిందయ్యను నిర్బంధించి ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

దేవళంపేటకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్లప్రసాద్, ఎమ్మెల్యే జగన్‌మోహన్ వచ్చారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన ఘటనపై ఆరాతీశారు.

దేవళంపేటలో దళితులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నేతలు



కూటమి అరాచకాలకు హద్దుల్లేవ్

చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ విగ్రహాన్ని తగలబెట్టిన వారిని దోషులుగా నిలబెట్టాలని కోరారు. చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అరాచకాలకు హద్దుల్లేవన్నారు. వాళ్ల తప్పులు చేసి ఆ నెపాన్ని తమపై నెడుతూ సునకానందం పొందుతున్నారన్నారు. గంగాధరనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి మాట్లాడుతూ దళితులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. దళితులనే చులకన భావంతో రెచ్చిపోతూ అవమానవీయంగా ప్రవర్తిస్తున్న టీడీపీ నాయకుడు సతీష్ నాయుడుపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి రామయ్య, బూత్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ పురుషోత్తం, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, నాయకులు నరసింహారెడ్డి, జగదీష్‌రెడ్డి, అమర్నాధ్ తోపాటు కార్వేటినగరం, పెనుమూరు, శ్రీరంగరాజపురం మండలాల నాయకులు పాల్గొన్నారు.

7 నుంచి జాతీయ సహకార సదస్సు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తిరుపతి వేదికగా మూడు రోజుల పాటు జాతీయ సహకార సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన శనివారం సదస్సు నిర్వహణపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి లక్ష్మితో పాటు జూమ్ మీటింగ్‌లోనూ పలువురు అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 9 వరకు తిరుపతిలోని తాజ్ హోటల్‌లో జాతీయ సహకార మంత్రిత్వశాఖ వర్క్‌షాపు ఉంటుందని వెల్లడించారు. సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి సహకార మంత్రిత్వశాఖ తీసుకున్న వివిధ కార్యక్రమాల అమలుపై సమీక్షించడానికి త్రైమాసిక సమావేశం జరగనుందని తెలిపారు. సమావేశానికి జాతీయ సహకార మంత్రిత్వశాఖ సెక్రటరీ ఆశిష్ కుమార్ భుటాని, ఏపీ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్, ఆంధ్ర రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారులైన స్పెషల్ చీఫ్ సెక్రటరీ అగ్రికల్చర్, సెరికల్చర్ కో-ఆపరేషన్స్, మార్కెటింగ్ తదితరులు రానున్నారని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ కో- ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, ఆర్డీఓలు తిరుపతి, శ్రీకాళహస్తి రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ విక్రమ్ కుమార్ రెడ్డి, పలువురు తహసీల్దార్లు, ఆర్టీసీ, టూరిజం అధికారులు హాజరయ్యారు.

పాలకమండలి కూర్పుపై గుర్రు

- శ్రీకాళహస్తి చైర్మన్ పదవి ఎంపిక నుంచి బోర్డు సభ్యుల వరకు..
- పార్టీ జెండా మోసిన వారెవ్వరికీ దక్కని చోటు
- కూటమి శ్రేణుల్లో అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : శ్రీకాళహస్తీశ్వరాలయ ఆలయ పాలక మండలి ఏర్పాటు కూటమిలో చిచ్చు రేపుతోంది. టీడీపీ, బీజేపీ, జనసేన కోసం జెండాలు మోసిన ఒకరిద్దరికి మినహా మిగిలిన వారెవ్వరికీ చోటు దక్కకపోవడంతో ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. పార్టీ కోసం కష్టపడినా తమను గుర్తించలేదని మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 15 నెలల తరువాత శ్రీకాళహస్తి ట్రస్టు బోర్డును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సన్నిహితుడు చెంచయ్యనాయుడుకే అని జోరుగా ప్రచారం జరిగింది. ఎమ్మెల్యే సైతం చెంచయ్య నాయుడుకేనని ప్రచారం చేశారు. అందులో భాగంగా ఆలయంలో కూడా చెంచయ్యనాయుడు చైర్మన్ కాకపోయినా ఆ స్థాయి గౌరవ మర్యాదలు దక్కేవి. అయితే ఎవ్వరూ ఊహించని విధంగా జనసేన నేత కొట్టే సాయిని చైర్మన్ పదవి వరించింది. అతడికి చైర్మన్ పదవి కట్టబెట్టడం వెనుక అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. గతంలో కొట్టేసాయి పోలీసు చేత చెంప దెబ్బతిన్నందుకు పవన్ కల్యాణ్ గుర్తించి చైర్మన్ పదవి కట్టబెట్టారని కొందరు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డే చేశారని మరి కొందరు, శ్రీకాళహస్తిపై మంచి అభిప్రాయం లేకపోవడంతో నేరుగా అధిష్టానమే దృష్టి సారించిందనే ప్రచారం జరుగుతోంది. చైర్మన్ పదవి జనసేన నాయకుడు కొట్టేసాయికి కట్టబెట్టటాన్ని తప్పుపడుతూ ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కోట వినూత బహిరంగ లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. తాము రాయుడు హత్య కేసులో జైలుకు వెళ్లటం వెనుక స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కొట్టేసాయి ఉన్నారంటూ ఆరోపించారు.

ఆ ముగ్గురు నేతల అనుచరులకు దక్కని ప్రాధాన్యం

శ్రీకాళహస్తి కూటమి పార్టీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జ్ కోట వినూత వెన్నంటి నడిచిన వారెవ్వరికీ ఆలయ పాలక మండలిలో చోటు దక్కలేదు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య వర్గీయులకు చోటు లభించలేదు. సత్రవాడ ప్రవీణ్, పేట బ్రదర్స్, చెంచయ్యనాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, దశరథాచారి, కంఠా రమేష్, కాసరం రమేష్, సుబ్రమణ్యం (బుజ్జి). సుబయ్య, కోలా ఆనంద్ ముఖ్య అనుచరుడు మేశాగారం సుబ్రమణ్యంరెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపించినా.. చివరకు వీరిలో ఏ ఒక్కరి పేరు లేదు. కోలా ఆనంద్ భార్యకు చైర్మన్ పదవిని కట్టబెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నం చేశారనే ప్రచారం ఉంది. చివరికి సభ్యుల జాబితాలో కోలా ఆనంద్ భార్య పేరు ఉండటంతో తీవ్ర అవమానంగా భావిస్తున్నట్లు తెలిసింది. 24 గంటలు కోలా ఆనంద్ తమ నాయకుడు, అతనే సర్వస్వం అని వెనుకే తిరిగిన మేశాగారం సుబ్రమణ్యం రెడ్డికి బోర్డులో చోటు కల్పించకుండా తన భార్యకు సభ్యత్వం ఇప్పించటంపైనా ఆగ్రహంగా ఉన్నట్లు బీజేపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. పైన చెప్పుకున్న వారెవ్వరికి బోర్డులో చోటు దక్కకపోవటం వెనుక ఎమ్మెల్యే హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎవ్వరూ అడ్డులేకుండా ఉండేలా ఎమ్మెల్యే జాగ్రత్తలు తీసుకున్నారని టీడీపీ శ్రేణుల్లో అనుమానం వ్యక్తం చేస్తోంది.

బీసీలకు చోటెక్కడ?

జిల్లాలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తి నియోజక వర్గం బీసీ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్నాయి. అందులో పల్లెరెడ్లు, యాదవ సామాజిక వర్గం వారే అధికం. ప్రతి ఎన్నికల్లో జయాపజయాలను నిర్ణయించే బీసీలకు శ్రీకాళహస్తి ట్రస్టు బోర్డులో చోటు దక్కకపోవడంపై ఆ సామాజిక వర్గం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో రెడ్డివారి గురవారెడ్డి, సత్రవాడ ప్రవీణ్, బీజేపీలో మేశాగారం సుబ్రమణ్యం రెడ్డి కీలకంగా ఉన్నా వారిని పట్టించుకోకపోవడంపైన మండిపడుతున్నారు. బీసీలు కేవలం ఓట్లు వేసేందుకేనా.. పదవులకు అర్హులు కాదా? అని ప్రశ్నిస్తున్నారు.

దంచికొట్టిన వాన



అండర్ ఓవర్ బ్రిడ్జిని ముంచెత్తిన వర్షపు నీరు ఇలా..



ఆర్సీ రోడ్డు, డీఆర్ మహల్ అండర్ ఓవర్ బ్రిడ్జి వద్ద వరదను తలపిస్తున్న వర్షపు నీరు

- తిరుపతిలో ఎడతెరిపిలేని వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రోడ్లను ముంచెత్తిన వర్షపునీరు



వర్షంలో కూరగాయల వ్యాపారుల అవస్థ

తిరుపతి తుడా : భారీ వర్షం తిరుపతిని ముంచెత్తింది. తెల్లవారుజామున 2 గంటల తర్వాత ప్రారంభమైన వర్షం ఉదయం 8 గంటల వరకు అదే జోరు కొనసాగించింది. నగరంలోని కాలువలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరింది. నగరంలో ఎక్కడ చూసినా మోకాళ్లోతు నీళ్లు కనిపించాయి.

పొంగి ప్రవహించిన కాలువలు

జోరు వానతో ఎగువ ప్రాంతాలైన కపిలతీర్థం, మాల్వాడి గుండం, ఎస్వీ యూనివర్సిటీ తదితర ప్రాంతాల నుంచి వర్షపు నీరు జోరుగా ప్రవహించింది. ఈ క్రమంలో కాలువలు పొంగి రోడ్లపై పెద్ద ఎత్తున నీరు పారింది.

కాలనీలు జలమయం

భారీ వర్షానికి లక్ష్మీపురం కూడలి, ఏఐఆర్ బైపాస్ రోడ్డు, లీలామహల్ కూడలి, కరకంబాడి రోడ్డు, కొర్లగుంట పెద్ద కాలువ ప్రాంతాల్లో వర్షపు నీరు పోటెత్తింది. ఇక్కడ వర్షపు నీరు ప్రమాదకర స్థాయిలో ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అలానే రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద వర్షపు నీరు ప్రమాదకర స్థాయికి చేరింది. నిమిషాల వ్యవధిలోనే అండర్ బ్రిడ్జి పూర్తిగా మునిగిపోయాయి . దీంతో నో ఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేశారు. మధురానగర్, మాధవనగర్, కొర్లగుంట, మారుతి నగర్, సుబ్బారెడ్డి నగర్, చంద్రశేఖర రెడ్డి కాలనీ, కట్టకిందపల్లి, కొరమీనుగుంట, ఆటోనగర్, లక్ష్మీపురం, ఎస్టీవీ నగర్, గాంధీపురం పరిసర ప్రాంతాల్లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరింది. ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు వీలుపడనంతగా ఆ వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది. అనేక ప్రాంతాల్లో ఇళ్లలోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో జన జీవనానికి ఆటంకం ఏర్పడింది.

ఉరుములు... మెరుపులు

భారీ వర్షంతో పాటు ఉరుములు మెరుపులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి. ఈ క్రమంలోనే పలు ప్రాంతాల్లో పిడుగులు పడినట్లు సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేశారు.

చిరు వ్యాపారులకు దెబ్బ

తిరుమల మూడో శనివారం ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చిరు వ్యాపారులు విక్రయాల కోసం శుక్రవారం సాయంత్రం నుంచి నగరంలో వ్యాపారాలను ప్రారంభించారు. ఊహించని భారీ వర్షం వ్యాపారులను దెబ్బతీసింది. భారీ వర్షానికి కూరగాయల మార్కెట్లోకి మోకాళ్లలోతులో నీళ్లు చేరడంతో కూరగాయలు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి.

వేగంగా సహాయక చర్యలు

భారీ వర్షం నేపథ్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశాలతో ప్రజా ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున వ్యర్థాలు చేరుకోవడంతో వర్షపు నీటిని పంపింగ్ ద్వారా తోడారు. సిబ్బంది చేతులు మీదుగా టన్నుల కొద్ది వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు.

చంద్రగిరిలో భారీ వర్షం

చంద్రగిరి : చంద్రగిరి మండల వ్యాప్తంగా శనివారం తెల్లవారిజామున 2 గంటల నుంచి ఉదయం 10.30గంటల వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురవడంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దీంతో ప్రజలు ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. ఈ క్రమంలో మండల పరిధిలోని ఏ.రంగంపేట కృష్ణాపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెంకటరమణ పూరి గుడిసె వెనుక భాగం నేలకూలడంతో ఆందోళనకు లోనయ్యాడు.



పూరి గుడిసె కూలిపోయిన దృశ్యాన్ని చూపుతున్న దివ్యాంగుడు వెంకటరమణ

క్లుప్తంగా

దౌర్జన్యంగా ప్రహరీ కూల్చివేత



మాధవమాలలో కూల్చివేసిన ఇంటి ప్రహరీ

ఏర్పేడు : మండలంలోని మాధవమాలలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడి ఇంటి ప్రహరీని శనివారం జేసీబీ సాయంతో కూల్చి వేశారు. అడ్డు వచ్చిన బాధితులపై దాడికి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు... మాధవమాలకు చెందిన పెరుమాల్ ఆచారి ఇంటి వద్ద వీధి సందుకు ఆనుకుని పట్టా భూమిలో ప్రహరీ నిర్మించారు. అయితే ఈ గోడను తొలగించాలని చూడగా గ్రామానికి చెందిన కొందరు అడ్డు చెప్పడంతో కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన టీడీపీ నేత భాస్కర్ ఆచారి, కిషోర్, ధనంజయులఆచారి, ధనరాజ్ ఆచారి, రవి ఆచారి, రాజ్‌కుమార్ తమ ఇంటి వద్దకు జేసీబీ తీసుకొచ్చి గోడను కూల్చేశారని బాధితుడు వాపోయాడు. గోడ కూల్చుతుండగా అడ్డుకున్న పెరుమాల్ ఆచారి, అతడి భార్య పద్మ, కుమారుడు మోహన్‌పై దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పింఛన్ సొమ్ము స్వాహా

- రూ.2.85 లక్షలు పంపిణీ చేయని వెల్ఫేర్ అసిస్టెంట్
- మెమో జారీ చేసిన ఇన్‌చార్జి ఎంపీడీఓ

గూడూరు రూరల్ : గూడూరు మండలం కొమ్మనేటూరు పంచాయతీ సచివాలయ పరిధిలోని 64 మంది పింఛన్‌దారులకు సంబంధించిన రూ.2.85 లక్షల నగదును వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్ స్వాహా చేసినట్లు సమాచారం. 160 పెన్షన్లకు సంబంధించిన నగదును తీసుకెళ్లి ఈనెల 1, 3 తేదీలలో మధ్యాహ్నం వరకు 96 పింఛన్లకు సంబంధించి నగదును అందించారు. మిగిలిన 64 పింఛన్‌లకు సంబంధించి రూ.2.85 లక్షల నగదును పంపిణీ చేయకుండా సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎవరికీ అందుబాటులో లేకుండా పోయాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ సెక్రటరీ చెంచు ప్రసాద్ ఉన్నతాధికారులతో పాటు ఇన్‌చార్జి ఎంపీడీఓ కౌసల్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్‌ను కార్యాలయానికి పిలిపించి మెమోను జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ తెలిపారు. సోమవారం లోగా పింఛన్ల నగదును అందించకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

– 10 మంది మహిళా కార్మికులకు గాయాలు

చిట్టమూరు: ఓ ప్రవేట్ కంపెనీలో పనిచేసి వస్తున్న మహిళా కార్మికులు.. ఆటోలో వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీ కొనడంతో ఆటో పల్టీలు కొట్టి పంట పొలాల్లో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వాకాడు మండలం తీపలపూడి గ్రామానికి చెందిన మహిళా కార్మికులు గ్రామం నుంచి ఓ ప్రవేట్ కంపెనీకి పనులకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని సాయంత్రం స్వగ్రామం తీపలపూడికి ఆటోలో బయలు దేరారు. అయితే చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామ సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీకొంది. దీంతో ఆటో పల్టీలు కొట్టి పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న సుమారు పది మంది మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయగా సమయానికి వాహనం రాలేదని తెలిపారు. దీంతో క్షతగాత్రులను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హత్యాయత్నం కేసులో మరో నిందితుడు అరెస్టు

సత్యవేడు: హత్యాయత్నం కేసుకు సంబంధించి సత్యవేడు దళితవాడకు చెందిన నిందితుడు సైమన్(25)ను సెప్టెంబరు20న అరెస్టు చేయగా, పరారైన మరో నిందితుడు లారెన్స్(30)ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. పోలీసుల కథనం మేరకు..ఆటోలో ప్రయాణిస్తున్న వారిని దాడి చేసి కొట్టిన కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులలో గతనెల సెప్టెంబరు 20న సత్యవేడు దళితవాడకు చెందిన సీమాన్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న సైమన్‌ను శనివారం మాదరపాకం చెక్‌పోస్టు సమీపంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహన డ్రైవర్ల సంక్షేమానికి కృషి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రజాప్రతినిధులు

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. కచ్చిపి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ పథకం ద్వారా జిల్లాలో అర్హులైన 14,375 మంది ఆటో, మోటార్ క్యాబ్, మ్యాక్స్ క్యాబ్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వాహన యజమానులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు రూ.21.56 కోట్ల మెగా చెక్కును అందజేశారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నేడు ఘనంగా ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నాయీబ్రాహ్మణ ఛైర్మన్ సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, రీజనల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ క్రిష్ణవేణి, హస్తకళ అభివృద్ధి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య , యూనియన్ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధిలో భాగస్వాములుకండి

- ఆలయానికి రూ.5 లక్షల విరాళం
- మేయర్ డాక్టర్ శిరీష పిలుపు



భూమన కరుణాకరరెడ్డి చేతులు మీదుగా ఆలయానికి రూ.5 లక్షలు విరాళం అందజేస్తున్న మేయర్‌శిరీష కుటుంబం

తిరుపతి కల్చరల్ : తిరుపతి గ్రామ దేవత శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి అవసరాల నిమిత్తం ప్రైవేటు స్థలం కొనుగోలు కోసం మేయర్ డాక్టర్ శిరీష కుటుంబ సభ్యులు రూ.5 లక్షల విరాళాన్ని శనివారం టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా ఆలయ ఈవోకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. గంగమ్మ ఆలయ అవసరాల కోసం ఆలయానికి ఆనుకుని ఉన్న ప్రవేటు స్థలాన్ని కొనుగోలు చేయడానికి అవసరమైన నిధుల కోసం ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో గంగమ్మ భక్తులుగా తమ కుటుంబం భాగస్వామ్యం కావాలని భావించి రూ.5 లక్షలు విరాళంగా అందించామని తెలిపారు. గంగమ్మ ఆలయ అభివృద్ధి , గంగమ్మ జాతర విశిష్టతను దశ దిశలా వ్యాప్తి చేసి, గంగ జాతరకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి భూమన కరుణాకరరెడ్డి కావడంతో ఆయన చేతులగా మీదుగా ఈ విరాళాన్ని ఇవ్వడం సముచితంగా ఉంటుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దాతల సహకారంతో అమ్మవారికి వజ్ర కిరీటం చేయించడం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి తిరుపతి గంగ జాతరకు అధికారిక గుర్తింపు ఇవ్వడం, ఆలయ జీర్ణోద్ధరణ, విస్తరణ పనులు, ప్రహరీ నిర్మాణం పూర్తి చేయడం వంటి అనేక కార్యక్రమాలు భూమన కరుణాకరరెడ్డి చేయించారని తెలిపారు. తిరుమల వెంకన్న చెల్లెగా పూజలందుకుంటున్న గంగమ్మను తొలుత దర్శించుకున్న తర్వాతే తిరుమల శ్రీవారి దర్శనం చేసుకునే ప్రాచీన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చినప్పుడు మొదటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించి తర్వాత తిరుమల శ్రీవారి దర్శనం చేసుకునే విధానానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. తాము అధికారంలో ఉన్నా లేకున్నా గంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, డాక్టర్ హేమకుమార్‌రెడ్డి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రమేష్, మునయ్య, సురేష్ యాదవ్ ,చింతా రమేష్, అంకయ్య, వెంకటేష్, బత్తయ్య, పురుషోత్తం, సూరి, ఆదినారాయణ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో 'నిరంతర వైద్య విద్య'



మాట్లాడుతున్న ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలోని అనస్తీషియా, కార్డియాలజీ, సిటీ సర్జరీ విభాగాల ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పద్మావతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించే ఉద్దేశంతో ప్రత్యేక సదస్సుకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. కార్డియాలజీ, సీటీ స్కాన్, సర్జరీ, అనస్తీషియా తదితర విభాగాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ, అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ అలో సమంతరే, డాక్టర్ రోహిత్ కుమార్, డాక్టర్ వహీద్ ఖాన్, డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

తెలుగు గంగ కాలువలో దూకి వ్యక్తి మృతి

కలువాయి (సైదాపురం) : మండలంలోని చింతలాత్మకూరు గ్రామానికి చెందిన నాగిళ్ల రవి(30) పర్లకొండ సమీపంలోని తెలుగు గంగ కాలువలోకి దూకేశాడని స్థానికులు తెలిపారు. శనివారం దాచూరు సమీపంలోని కండలేరు డ్యామ్ నందు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి ఎస్‌ఐ కోటయ్య వెళ్లి సమగ్ర విచారణ చేపట్టారు. గంగ కాలువలోకి దూకిన రవికి మతిస్థిమితం సరిగా లేదని మృతుడు రవి తల్లిదండ్రులు వివరించారని పోలీసులు తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాకాల : మండలంలోని దామలచెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. వివరాలు.. మ్యాంగో నగర్ క్రాస్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే దారిలోని మద్యం దుకాణం సమీపంలో సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ సుదర్శన్ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2 గంటలు..4 చైన్ స్నాచింగ్‌లు

– నగరంలో చైన్‌స్నాచర్ల హల్‌చల్

తిరుపతి క్రైమ్ : నగరంలో చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. రెండు గంటల వ్యాధులు నాలుగు ప్రాంతాల్లో మహిళ మెడలలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

- మంగళంలో నివాసం ఉంటున్న లగడపాటి నాగభూషణ అమ్మ కరకంబాడి రోడ్డు లోని రాయల్ బుక్స్ షోరూం సమీపంలో ఉన్న కొడుకు ఇంటికి వెళ్లింది. పని ముగించుకొని తిరిగి మంగళం వెళ్లేందుకు సాయంత్రం సుమారు 4.50 నిమిషాల మధ్య ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇరువురు వ్యక్తులు బైక్‌పై వచ్చి అకస్మాత్తుగా మెడలోని చైన్ లాగే ప్రయత్నం చేశారు. అయితే ఆమె ప్రతిఘటించడంతో మెడలో ఉన్న రెండు చైన్‌లను తెంపగా.. అందులో ఉన్న తాళిబొట్టు ఆమె చేతికి వచ్చింది. దుండగులు 48 గ్రాముల బంగారు గొలుసును దోచుకెళ్లినట్లుగా ఫిర్యాదు చేశారు.
- అదే పరిధిలో గొల్లవాని గుంటలో నివాసం ఉంటున్న సరస్వతమ్మ ఇంటి సమీపంలో సొంత పనుల నిమిత్తం బయటికి రాగా అకస్మాత్తుగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో ఉన్న చైను లాక్కెళ్లారు. సాయంత్రం ఈ ఘటన 3.40కు చోటు చేసుకోగా సుమారు 48 గ్రాములు బంగారం పోయినట్లుగా ఫిర్యాదు చేశారు.
- ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోస్టల్ కాలనీలో నివాసం ఉంటున్న జయశ్రీ సుమారు మూడున్నర గంటల సమయంలో ప్రొవిజన్ షాపునకు వెళ్లి... తీసుకుని వెళుతుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి సుమారు 30 గ్రాముల చైన్ లాక్కెళ్లినట్లుగా ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.
- అదేవిధంగా అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న తాటి బెల్లం కాఫీ షాప్ సమీపంలో తిమ్మినాడి పాలెంలో నివాసం ఉంటున్న మంజుల సొంతపని నిమిత్తం బయట తిరుగుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మెడలో ఉన్న చైన్ లాక్కెళ్లారు. సుమారు 52 గ్రాములు బంగారం అపహరించినట్లు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు.
- ఒకే రోజు తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో వేరు వేరు ప్రాంతాల్లో నాలుగు చోట్ల చైన్ స్నాచింగ్‌లు చోటు చేసుకోవడంతో ఒకే ద్విచక్ర వాహనంలో వచ్చిన వ్యక్తులే ఈ చోరీలకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమై నగరంలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం నుంచి పోలీసులు ముమ్మరంగా ద్విచక్ర వాహనాల తనిఖీలు చేపట్టారు.

డబ్బులొస్తే.. డ్రైనేజ్ పనులు

- మీడియా సమావేశంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మంత్రి నారాయణ

తిరుపతి అర్బన్ : డబ్బులొస్తే తిరుపతిలో డ్రైనేజ్ పనులు చేద్దామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. తుడా ఆఫీస్‌లో ఆయన శనివారం రాత్రి 9.30 గంటలకు మీడియా సమావేశంలో తెలిపారు. డిసెంబర్‌లో రూ.45 కోట్ల మేరకు లేఅవుట్లు వేసుకున్న వారు తుడాకు చెల్లించాల్సిన డబ్బులు వస్తాయని చెప్పారు. దాంతో డ్రైనేజ్ పనులు, తాగునీరు, రోడ్లు ఏర్పాటు చేద్దామని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసిన అనంతరం వీధిలైట్లు ఇతర అభివృద్ధి పనులు చేద్దామని చెప్పారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు తిరుపతి నగరంలో ముంపు ప్రాంతాలు, వర్షానికి పై భాగంలోని మార్వాడి గుంట నుంచి వచ్చే వరద నీటి ఇబ్బందుల నేపథ్యంలో చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేయాలని ప్రశ్నించారు. ఆ పనులు కూడా చేద్దాం నిధులు మంజూరైన తర్వాత అంటూ సమాధానం ఇచ్చారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా తాగునీరు, డ్రైనేజ్, రోడ్లు తదితర పనులను చేపట్టడానికి మూడు దశల్లో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఆయనతో పాటు తుడా వీసీ, జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనర్ మౌర్య , యాదవ సంఘం చైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఉన్నారు.